క్లుప్తంగా

ఎడ్యుకేషన్ సెక్రటరీకి నివాళి

చీరాల: చీరాల పురపాలక సంఘంలోని హరిప్రసాద్‌నగర్ సచివాలయం-1లో ఎడ్యుకేషన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న పొట్లూరి రాధామాధవి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సచివాలయం ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది మృతురాలు రాధామాధవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పాలెపు శ్రీనాథ్‌బాబు (48) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. పట్టణంలోని బెస్తపాలెంలో నివాసం ఉంటున్న శ్రీనాథ్‌బాబు జెడ్పీ హైస్కూల్ బాలురు ఈపురుపాలెంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. గణిత ఉపాధ్యాయుడి మృతిపై ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఉద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

బైకును ఢీకొట్టిన కారు

అద్దంకి రూరల్: రోడ్డు దాటుతున్న బైకును కారు ఢీకొట్టడంతో బైకిస్టుకు గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం సాయంత్రం అద్దంకి పట్టణంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం.. అద్దంకి పట్టణానికి చెందిన షేక్ అహ్మద్ ఆర్ఎంపీగా పని చేస్తున్నాడు. రంజాన్ మాసం కావడంతో స్థానిక భవానీ సెంటర్‌లోని మసీదుకు నమాజ్ చేసేందుకు వచ్చాడు. ముగించుకుని బయటకు వచ్చి వెళ్లే సమయంలో బైకు మీద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో అహ్మద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోడిపందేల శిబిరంపై దాడి

స్వర్ణ (కారంచేడు): కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో కారంచేడు పోలీసులు దాడి చేశారు. అక్కడ కోడిపందేలు ఆడుతున్న వారిని అరెస్టు చేశారు. ఎస్ఐ అనిత తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని స్వర్ణ దొంగతూముల సమీపంలో కోడిపందేలు ఆడుతున్నారనే సమాచారం వచ్చింది. ఆమె తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ పందేలు జరుపుతున్న ఆరుగురు వ్యక్తులతో పాటు మూడు పందెం కోళ్లు, రూ.7 వేల నగదు, ద్విచక్ర వాహనలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తప్పిన అగ్ని ప్రమాదం

పర్చూరు (చినగంజాం): ఓ టీ దుకాణంలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఓ టీ దుకాణంలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. టీ దుకాణదారుడు గృహ అవసరాల సిలిండర్ నుంచి వ్యాపార అవసరాల సిలిండర్‌కు గ్యాస్‌ను నింపుతుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. గతంలో పలుమార్లు ఇదే విధంగా టీ స్టాల్‌లో మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు.

20 ఎకరాల గడ్డివామి దగ్ధం

కుంకలమర్రు (కారంచేడు): మండలంలోని కుంకలమర్రులో సోమవారం జరిగిన ప్రమాదంలో సుమారు 20 ఎకరాల గడ్డి వామి దగ్ధమైంది. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో అదే ప్రాంతానికి చెందిన జొన్నలగడ్డ చిన అబ్రహాంకు చెందిన సుమారు 20 ఎకరాల గడ్డి వామి నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చాయి. స్థానికులు గమనించి మంటలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు చాలా ప్రయత్నం చేశారు. అప్పటికే వేసవి ఎండల తీవ్రతతో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండి మంటలు అదుపు చేయడం గ్రామస్తుల వల్ల కాలేదు. అప్పటికే గ్రామస్తుల సమాచారంతో అక్కడికి చేరుకున్న చీరాలకు చెందిన ఫైరింజన్ వచ్చి మంటలు అదుపు చేసింది. గడ్డి వామి పూర్తిగా కాలిపోయింది. దాని విలువ సుమారు రూ.లక్షకుపైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

ఎన్‌సీసీ క్యాంపునకు ఇద్దరు ఎంపిక

చీరాల: వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ షేక్ గౌస్‌బాషా వచ్చే నెలలో చెన్నైలో జరిగే ఆల్ ఇండియా ఎన్‌సీసీ క్యాంపునకు ఎంపికయ్యాడని కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు తెలిపారు. 23 ఆంధ్రా బెటాలియన్ పరిధిలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విశేష ప్రతిభ చూపిన క్యాడెట్ గౌస్‌బాషా, ఎం.జయప్రసాద్‌లు ఆలిండియా క్యాంపునకు కల్నల్, కమాండింగ్ ఆఫీసర్ సునీల్‌గౌతమ్ ఎంపిక చేశారన్నారు. ఆల్ ఇండియా క్యాంపునకు హాజరైన క్యాడెట్లను కళాశాల అధ్యాపకులు, ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది అభినందించారు.

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి

ఇంకొల్లు (చినగంజాం): సాగు భూమిలో రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.మోహనరావు అన్నారు. మండలంలోని ఇంకొల్లు ఆర్బీకే-1 రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను మట్టి నమూనా సేకరణ మరియు భూ సార పరీక్షల అవగాహనపై ఒక రోజు శిక్షణ సోమవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పి.వేణుగోపాల్, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో ఇళ్లకే సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజలకు ఇంటి ముందుకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని విజయనగర్ కాలనీ గ్రామ పంచాయతీలోని సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఇన్‌చార్జ్ కరణం మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలంతో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు వార్డు సచివాలయంలో సంప్రదించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనేది సీఎం ఆశయమన్నారు. ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవరత్నాల పథకాలను అర్హులందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వార్డులోని ప్రతి గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వం అన్నీ వర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయాని అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, ఏపీఎం సుబ్బారావు, పంచాయతీ సెక్రటరీ గౌస్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు మోషే, పవన్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు జగనన్నపైనే నమ్మకం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి



మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి దంపతులు

యర్రంవారిపాలెం (కారంచేడు): రాష్ట్ర ప్రజల భవిష్యత్తు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే ఉందని, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుతున్న అనేక సంక్షేమ పథకాలతో ప్రజలంతా మా నమ్మకం నువ్వే జగనన్న అంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వ్యవసాయ, సహకార రంగ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తన స్వగ్రామం యర్రంవారిపాలెంలో ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులతో మాట్లాడారు. ఆయన సతీమణితో గ్రామానికి వచ్చిన ఆయన గ్రామస్తులు, మహిళలతో ముచ్చటించారు. రాష్ట్రంలోని అన్ని రంగాల వారు, కుల, మతాలు, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతోందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు ఇంటి తలుపు తడుతుంటే వైఎస్సార్ సీపీ కార్యకర్తలే కాకుండా మిగిలిన పార్టీలకు చెందిన వారు సైతం ఈ సారి మా ఓటు జగన్‌మోహన్‌రెడ్డికేనని, ఆయన వస్తేనే మళ్లీ సంక్షేమ పథకాలు రెట్టింపు అవుతాయనే నమ్మకంతో ప్రజలున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న పాలన ప్రజలకు అందుబాటులో ఉండేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థల ద్వారా నేరుగా పథకాలు ఇంటికి వస్తున్నాయన్నారు. గతంలో ఒక పథకానికి అర్హత సాధించాలంటే రోజులు, నెలల తరబడి మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లి పనులు చేయించుకోవాల్సి వచ్చేదన్నారు. గ్రామ సర్పంచ్ ఈవూరి మాధవి, భవనం పద్మావతి, ఆదిపూడి సొసైటీ అధ్యక్షుడు యర్రం లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ గుడిబండి అంజిరెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అదృశ్యంపై కేసు



కానిస్టేబుల్ సురేష్

వేటపాలెం: సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వేటపాలేనికి చెందిన సురేష్ చాలా రోజుల నుంచి కనిపించడం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ సోమవారం తెలిపారు. తన భర్త సంవత్సరం కిందట సీఎస్‌పురం పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. మద్యానికి బానిసై అక్కడ విధులు సరిగ్గా హాజరయ్యేవాడు కదని పేర్కొన్నారు. ఇంటికి కూడా సక్రమంగా రాకుండా అప్పుడప్పుడూ వచ్చేవాడని భార్య కామేశ్వరి తెలిపింది. కొద్ది నెలల కిందట ఇంటికి వచ్చిన తన భర్త విధులకు సీఎస్ పురం వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి తిరిగి ఇప్పటి వరకు ఇంటికి రాలేదని పేర్కొంది. సీఎస్ పురం పోలీస్ స్టేషన్‌లో విచారించగా సురేష్ డ్యూటీకి రావడం లేదని తమకు సమాచారం ఇచ్చారని తెలిపింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్



వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యలను పరామర్శిస్తున్న కృష్ణ చైతన్య

- నివాళులర్పించిన ఎస్పీ వకుల్ జిందాల్, బాచిన కృష్ణ చైతన్య

బల్లికురవ: అద్దంకి పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తన్నీరు వెంకటేశ్వర్లు (55) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో చనిపోయారు. స్వగ్రామం బల్లికురవ మండలం కొత్తూరు గ్రామానికి భౌతిక కాయాన్ని తరలించారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాస్, సీఐలు లక్ష్మణ్, రోశయ్య, బల్లికురవ ఎస్ఐ వేమనలు.. వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చరు. పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు ముగించారు

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

గుండెపోటుతో చనిపోయిన వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీస్ శాఖ, ప్రభుత్వ పరంగా వెంకటేశ్వర్లు కుటుంబానికి అందాల్సిన సాయం అందజేసేందుకు కృషి చేస్తానని చైతన్య అన్నారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతల పేరయ్య, సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు హెచ్ అశ్వనీ, కిషోర్, లక్ష్మీనాయక్, గ్రామస్తులు ఉన్నారు.

సముద్రతీరం వద్ద అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

వేటపాలెం: వేసవి సెలవుల్లో సముద్రతీరానికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, సముద్రంలో ప్రమాదాలు జరకుండా అప్రమత్తంగా ఉండాలని చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు సూచించారు. మండల పరిధిలోని రామాపురం సముద్రతీరం వద్ద రిసార్టుల యజమానులు, మెరైన్ సిబ్బంది, పోలీస్ సిబ్బందికి అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రాబోవు మూడు నెలల పాటు అన్ని విద్యా సంస్థలకు సెలవులు ఉంటాయని తెలిపారు. సెలవుల సమయంలో హైదరాబాద్, విజయవాడ వంటి దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు సముద్రతీరానికి విహార హాత్రలకు అధిక సంఖ్యలో వస్తుంటారని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి సముద్రం నీటిపై పెద్దగా అవగాహన ఉండదని, ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఇటీవల కాలంలో అనేక మంది సముద్రంలో ప్రమాదవశాత్తు మునిగి మరణించిన సంఘటనలు ఎక్కువగా ఉన్నాయని గుర్తుచేశారు. సముద్ర తీరంలో రిసార్టుల యజమానలు వారి రిసార్టుల ప్రైవేటుగా గజ ఈతగాళ్లను నియమించుకోవాలని సూచించారు. మెరైన్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సముద్ర తీరంలో రోజూ మెరైన పోలీస్‌లు ఉంటుంటారని తెలిపారు. తగినంత సిబ్బంది లేక పోవడంతో అన్ని ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయడం కష్టతరంగా ఉంటుందని తెలిపారు. వేసవి సెలవుల సమయంలో రిసార్టు యజమానులు వారికి సంబంధించిన రిసార్టుల ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేటపాలెం ఎస్ఐ సురేష్, ఈపురుపాలెం ఎస్ఐ జనార్దన్, మెరైన్ ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

టోల్ ప్లాజాను పరిశీలించిన ఎస్పీ

- అధికారుల కళ్లుగప్పి పారిపోయిన అగంతకులు
- గంజాయి అక్రమ రవాణా ముఠాకావచ్చని అనుమానం

మార్టూరు: స్థానిక జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్ ప్లాజాను సోమవారం బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ఫిరోజ్ బృందం కారు ఆపే ప్రయత్నాలు చేయగా అందులోని వ్యక్తులు ఆపకుండా వెళ్లిపోయారు. అధికారులు వారి వాహనాన్ని వెంబడించినా ఫలితం లేకపోయింది. ఇటీవల మార్టూరు, టోల్ ప్లాజా వద్ద తరుచూ గంజాయి రవాణా ముఠా సభ్యులు పట్టుపడుతున్న నేపథ్యంలో అధికారులను ధిక్కరించి వెళ్లిన కారు సైతం అలాంటిదే అని పోలీసు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో విషయం తెలిసిన ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం బలికురువ వెళ్తూ టోల్ ప్లాజా వద్ద ఆగి జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఫిరోజ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం ఘటనకు సంబంధించి కొందరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

గంగమ్మతల్లికి ఆడపడుచుల పొంగళ్లు



అమ్మవారికి పొగళ్లు సమర్పిస్తున్న గ్రామ ఆడపడుచులు

కారంచేడు: గ్రామ దేవత జగజ్జననీ గంగాభవానీ అమ్మవారికి సోమవారం గ్రామ ఆడపడుచులు పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. ఈ నెల 12వ తేదీ నుంచి అమ్మవారి ఆలయ 36వ శిళ్లు, నారునాళ్లు, శిడిమాను మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి శిడి మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం నుంచి గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామ ఆడపడుచుల పొంగళ్లతో ఉత్సవాలను ముగించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులు, ఆడపడుచులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

సంక్షేమ పథకాలే జగనన్నను గెలిపిస్తాయి

యద్దనపూడి: సంక్షేమ పథకాలే జగనన్నను గెలిపిస్తాయని యనమదల సర్పంచ్ రాయి పృథ్వీరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని యనమదలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం వైఎస్సార్ సీపీ నాయకుడు మారెళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం వారి ఇంటికి,సెల్‌ఫోన్‌లకు స్టిక్కర్లు అంటించారు. రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సచివాలయ కన్వీనర్ జే.ప్రశాంతి, ఎలియా, వలంటీర్లు పాల్గొన్నారు. పూనూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్లు పఠాన్ అయూబ్‌ఖాన్, బత్తుల విమలా ఆంజనేయప్రసాద్, సుగుణరావు పాల్గొన్నారు.



యనమదలలో వైఎస్సార్‌సీపీ నాయకులు

క్రీడాకారుడు వేణుకు తెలంగాణ గవర్నర్ అభినందనలు



వేణును అభినందిస్తున్న తెలంగాణ గవర్నర్ తమిళసై

చీరాల టౌన్: పోర్చుగల్ దేశంలో జరిగిన వికలాంగుల వరల్డ్ గేమ్స్‌లో హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య మెహత ఫౌండేషన్ సహకారంతో చీరాల మండలం ఈపురుపాలేనికి చెందిన వినుకోటి వేణు డిస్కస్‌త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. దీంతో సోమవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో తెలంగాణా గవర్నర్ తమిళసైను దివ్యాంగ క్రీడాకారుడు వేణు, ఫౌండేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. వికలాంగుల పోటీల్లో పతకం సాధించిన వేణును తెలంగాణ గవర్నర్ సత్కరించి అభినందించారు. దివ్యాంగులు కూడా అన్నీ రంగాల్లో రాణించాలని గవర్నర్ తమిళసై ఆకాంక్షించారు.

నేటి నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

అద్దంకి రూరల్: మే 10వ తేదీన జరగనున్న పాలీసెట్ పరీక్షలకు అద్దంకి పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ ఏవీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతాయన్నారు. దరఖాస్తు చేయని వారు అదనపు రుసుం లేకుండా చెల్లించాల్సి ఉంటుదని తెలిపారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన చైతన్య



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైతన్య

అద్దంకి: బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రంజిత్ బాషాను రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య సోమవారం బాపట్లలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నూతన సంయక్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ శ్రీధర్‌ను మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కోటపాడులో అగ్ని ప్రమాదం

- నాలుగు పూరిళ్లు, గడ్డివామి దగ్ధం



కాలిపోయిన నాలుగు పూరిళ్లు

జే.పంగులూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కోటపాడులో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కోటపాడు దళిత కాలనీకి చెందిన గొల్లపూడి చిన్న పూరింటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలంటుకున్నాయి. మంటలు స్థానికులు ఆపే ప్రయత్నం చేసేలోపే చుట్టుపక్కల ఉన్న 3 ఇళ్లకు క్షణాల్లో నిప్పు అంటుకుంది. నిప్పు అంటుకున్న నాలుగు ఇళ్ల కుటుంబ సభ్యులు కట్టు బట్టలతో బయట పడ్డారు. మేడు అంజయ్యకు చెందిన ఇంట్లో రెండు జతల బంగారం బుట్టలు, రూ.10 వేల డబ్బు, గృహోపకరణాలు కాలిపోయాయి. గొల్లపూడి రవికి చెందిన ఇంట్లో ఆరు గ్రాముల బంగారు జుమికీలు కాలిపోయాయి. గొల్లపూడి చిన్న అర సవర బంగారు ఉంగరం కాలి బూడిదైంది. గొల్లపూడి శిరోమణి, గొల్లపూడి శిలువరాజు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. నాలుగు పూరిళ్లకు ఆనుకొని ఉన్న సామేలుకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమైంది. దీని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుంది. సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. సమాచారం అందుకున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా



సుబ్బరాయుడిని పరామర్శిస్తున్న పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

- వైఎస్సార్ సీపీ పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి

కారంచేడు: జగనన్నను నమ్ముకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మండల కేంద్రం కారంచేడు చెరువుకట్ట మీద ప్రాంతానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంపరాల సుబ్బరాయుడు ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో ఆయనను వారి ఇంటికి వెళ్లి సోమవారం పరామర్శించారు. ఆయన యోగ, క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని ఆమంచి ఆకాంక్షించారు. ఆయన వెంట పర్చూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్, యార్లగడ్డ రామకృష్ణ, యార్లగడ్డ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ పులి గంగరాజు, డైరెక్టర్లు స్వర్ణ శ్రీనివాసరావు, యార్లగడ్డ శ్రీకాంత్, బొబ్బేపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఉప్పలపాటి అనీల్ చౌదరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ట్యాబ్ అందజేత



నగదు, ట్యాబ్, పుస్తకాలు అందిస్తున్న దాతలు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం పడవల లక్ష్మణస్వామి మెమోరియల్ డిజిటల్ గ్రంథాలయానికి సోమవారం ప్రగఢ కోటయ్య కుమారుడు ప్రగఢ వెంకట శేషశయన, కోడలు పద్మలు తమ వంతుగా సహకారం అందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ట్యాబ్, గ్రంథాలయ నిర్వహణ, అభివృద్ధి కోసం రూ.5 వేల నగదు, జేఈఈ పరీక్షల మోడల్ పేపర్లు అందించారు. నగదు, పుస్తకాలు, ట్యాబ్‌ను గ్రంథాలయ అధ్యక్షులు, విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త అందె మురళీ వరప్రసాద్‌కు అందించారు. దాతలు మాట్లాడుతూ ఈపురుపాలెం యువజన, పీఎల్ఎస్ఎం గ్రంథాలయం ద్వారా వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని, గ్రంథాలయ అభివృద్ధితో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పుస్తకాలు అందించామన్నారు. మారుతున్న ఆధునిక సాంకేతికతను అభ్యర్థులు వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ నాగవీరభద్రాచారి, విశ్రాంత ఎంఈవో యల్లమందారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అందుబాటులో పుస్తకాలు



సెంటర్‌ను ప్రారంభిస్తున్న సెక్రటరీ కోటేశ్వరి

అద్దంకి: బుక్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటుతో గ్రామంలోని వారికి వివిధ రకాల దిన పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బొమ్మల కోటేశ్వరి అన్నారు. ఆమె బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మిన్నెకల్లులో సోమవారం బుక్ డిపాజిట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ బుక్ డిపిజిట్ సెంటర్‌తో గ్రామస్తులకు వివిధ రకాల పుస్తకాలు, వారపత్రికలు, దిన పత్రికలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ సెంటర్‌ను ఒకరు నిర్వహిస్తారని చెప్పారు. వీలు దొరికినప్పుడల్లా వచ్చి అయా పుస్తకాలు, పత్రికలు చదుకోవచ్చని చెప్పారు. వెంకట్రావు, సెంటర్ నిర్వాహకుడు వినోద్‌బాబు, గ్రంథపాలకుడు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజుగారిపాలెంలో ఇరువర్గాల ఘర్షణ

మార్టూరు: పొలంలో గేదెలు పడ్డాయనే విషయమై మండలంలోని రాజుగారిపాలెంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విభూది అమరలింగం పొలంలో అదే గ్రామానికి చెందిన బత్తిన అంకమ్మ గేదెలు మేత కొరకు దిగడంతో అమరలింగం..అంకమ్మను ప్రశ్నించాడు. అందుకు అంకమ్మ నిర్లక్ష్యంగా సమాధానం చెపుతూ చుట్టుప్రక్కల వారు వారిస్తున్నా వినకుండా వికలాంగుడైన అమరలింగంపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో అతని చేతి వేలికి గాయమైంది. తనపై అంకమ్మ దాడి చేసిన విషయాన్ని బాధితుడు అమర లింగం సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరావుకు తెలుపగా సర్పంచ్ అంకమ్మను పిలిపించాడు. పొలం నుంచి గ్రామంలోకి వస్తున్న అంకమ్మను మార్గమధ్యంలో అమరలింగం తరపు బంధువులు, మహిళలు చుట్టుముట్టి దాడి చేశారు. ఇరువర్గాలకు చెందిన సుమారు 150 మంది పరస్పర తోపులాటకు పాల్పడటంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.